# రైతులకు మరో అవకాశం.జూలై 31 వరకు రైతు భరోసా' దరఖాస్తుల స్వీకరణ.





**పాపన్నపేట,జూలై,20,(మెదక్ టుడే న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 'రైతు భరోసా' పథకం కింద వానాకాలం 2026-27కు సంబంధించిన కొత్త దరఖాస్తులు, బ్యాంకు ఖాతా వివరాల సవరణ కోసం ఈ నెల 31వ తేదీ వరకు మరో అవకాశం కల్పించింది.2026 జూన్ 15వ తేదీ వరకు కొత్త భూ పట్టా పాసుబుక్ పొందిన రైతులు, అలాగే ఇప్పటి వరకు భూ పట్టా పాసుబుక్ ఉన్నప్పటికీ 'రైతు భరోసా' పథకం ప్రయోజనం పొందని అర్హులైన రైతులు తమ బ్యాంకు వివరాలను నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని పాపన్నపేట మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస రాజు తెలిపారు.అనంతరంమాట్లాడుతూ,దరఖాస్తు చేసుకునే రైతులు రైతు భరోసా దరఖాస్తు ఫారం, భూ పట్టా పాసుబుక్ ( పిపిబి) కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ లేదా క్యాన్సిల్ చెక్, మొబైల్ నంబర్‌తో పాటు సంబంధిత రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి ( ఏ ఈ ఓ)ను సంప్రదించాలని సూచించారు.అలాగే, ఇప్పటికే 'రైతు భరోసా' పథకంలో నమోదైన రైతులు తమ బ్యాంకు ఖాతా వివరాలను మార్చుకోవాల్సి ఉంటే, ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి ( ఏఈఓ)ని సంప్రదించి అవసరమైన పత్రాలతో మార్పులు చేయించుకోవాలని అధికారులు తెలిపారు.అర్హులైన ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు తేదీ జూలై 31లోపు దరఖాస్తులు సమర్పించి 'రైతు భరోసా' పథకం ప్రయోజనాలను పొందాలని ప్రజలను కోరారు.

# మురుగు నీటితో బీడుగా మారుతున్న పొలాలు: తహసీల్దార్‌కు చేగుంట రైతుల వినతి



**చేగుంట జులై 20 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం చేగుంట పట్టణం లో నుండి వచ్చే మురుగు నీరు నేరుగా తమ పంట పొలాల్లోకి వదలడం వల్ల సుమారు 300 మంది రైతుల వ్యవసాయ క్షేత్రాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, చేగుంట రైతులు తహసీల్దార్ బాల్ లక్ష్మి కి వినతి పత్రం అందజేశారు.
గత 15 సంవత్సరాలుగా పట్టణ మురుగు నీరు పొలాల్లోకి రావడంతో పంట భూములు మురికి కూపలుగా మారాయని రైతులు వాపోయారు. గతంలో ఉన్న నడి కాలువ మురుగు నీటితో పూర్తిగా నిండిపోవడంతో, ఆ నీరంతా పొలాల మీదుగా ప్రవహిస్తోందని తెలిపారు.

**పంట నష్టం:**
మురుగు నీరు చేరడంతో పొలాల్లో ట్రాక్టర్లు, నాగళ్లు దిగబడిపోయి దుక్కి దున్నలేని పరిస్థితి నెలకొందని, దీంతో తీవ్ర పంట నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతుల డిమాండ్:**
రెవెన్యూ రికార్డుల ప్రకారం నడి కాలువను వెంటనే తవ్వించి, శాశ్వత పరిష్కారంగా సీసీ కాలువ నిర్మాణం చేపట్టాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు.
రైతుల సమస్యలపై తహసీల్దార్ బాలలక్ష్మి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతులు పూలబోయిన ముత్యాలు, నాగరాజు, భాను చందర్, రాజు, భాస్కర్, గడ్డమీది దేవేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డుల మోత.. అభినందనలతో మురిసిన చిన్నారులు: పటాన్‌చెరు విద్యార్థుల ఘనతపై ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రశంసలు"





**పటాన్‌చెరు, జూలై 20: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
కరాటే క్రీడలో అద్భుతమైన ప్రతిభను చాటి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్న బీరంగూడకు చెందిన 'క్రేజీ క్రూ కరాటే అకాడమీ' విద్యార్థులను పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో విజేతలను సన్మానించి, వారిని ఉత్సాహపరిచారు.క్రీడలే చిన్నారుల భవిష్యత్తుకు పునాది: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "అంతర్జాతీయ స్థాయిలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో మన పటాన్‌చెరు ప్రాంత చిన్నారులు గిన్నిస్ రికార్డు సృష్టించడం గర్వకారణం. విద్యార్థి దశ నుండే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుంది. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి. చిన్నారుల విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన మాస్టర్ సంతోష్ రెడ్డికి అభినందనలు. భవిష్యత్తులో కూడా మీరు ఇలాంటి మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి, మన ప్రాంతానికి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.శిక్షకుల పట్టుదల, చిన్నారుల క్రమశిక్షణే గెలుపునకు కారణం: మాస్టర్ సంతోష్ రెడ్డిఅకాడమీ నిర్వాహకులు మాస్టర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, "మా అకాడమీ విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో కఠినంగా శిక్షణ తీసుకున్నారు. గచ్చిబౌలి వేదికగా జరిగిన ఈ పోటీలలో చిన్నారులు ప్రదర్శించిన ప్రతిభ గిన్నిస్ రికార్డును సొంతం చేసుకునేలా చేసింది. ఈ అరుదైన విజయం సాధించిన మా చిన్నారులను స్వయంగా పిలిపించి అభినందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారికి ధన్యవాదాలు. ఎమ్మెల్యే గారి ప్రోత్సాహం మా విద్యార్థులకు, క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లేష్, శివా రెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచందర్, రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ మడేలయ్య స్వామి ఉత్సవాలు



**చేగుంట జూలై 20, మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం లోని చందాయి పేట్ గ్రామం లో రజకులు స్థానిక చెరువు లొ గల దేవాలయం వద్ద రజకులంతా తమ కులదైవమైన శ్రీ మడేలయ్య స్వామి ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు.తొలుత గ్రామం లోని రజక వాడ నుంచి భక్తులంతా సామూహిక బోనాలతో ఊరేగింపుగా తరలివెల్లి గ్రామం లోని శ్రీ పెద్ద పోచక్క తల్లిని దర్శించుకొని బోనాలను సమర్పించారు.అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం శ్రీ కట్ట మైసమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత గ్రామ చెరువు లోని శ్రీ మాడేలయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అమ్మవారి దర్శించుకోవడానికి వచ్చిన స్థానిక సర్పంచ్ తాలూకా మహేశ్వరి సాయిబాబా, ఉప సర్పంచ్ నాగేష్ గుప్తాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూలా మల, శాల్వా తో సన్మానించారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రజకులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో సేల్స్‌ఫోర్స్, నిర్మాణ్ సంస్థలు: విద్యార్థుల ప్రతిభను అభినందించిన ఆదర్శ్ రెడ్డి దంపతులు





**రామచంద్రపురం జూలై 20:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సోమవారం బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని 'అభిలాష వొకేషనల్ సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ డిసేబుల్డ్ చిల్డ్రన్'లో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.సేల్స్‌ఫోర్స్ సంస్థ, నిర్మాణ్ సంస్థల సహకారంతో చేపట్టిన ఈ పనులను వారు ప్రారంభించారు. పాఠశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రత్యేక అవసరాల విద్యార్థులు తయారు చేసిన ఉత్పత్తులను ఆదర్శ్ రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డి పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు.ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో బొంబాయి కాలనీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సేల్స్‌ఫోర్స్ సంస్థ అందించిన సహకారాన్ని గుర్తు చేశారు. సమాజ సేవలో నిరంతరం భాగస్వామ్యమవుతున్న సేల్స్‌ఫోర్స్ మరియు నిర్మాణ్ సంస్థలకు నియోజకవర్గ ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ నీలిమ, సేల్స్‌ఫోర్స్ ప్రతినిధులు సుదీప్ కంచర్ల (వైస్ ప్రెసిడెంట్, ఐటీ), అభినేష్ బద్దం (డైరెక్టర్), చంద్ర సమల (సీనియర్ డైరెక్టర్), స్వప్న, నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు నీరజ, నికి, సౌమ్య పాల్గొన్నారు. అలాగే, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు దేవేంద్ర చారి, పాటి సత్యనారాయణ, నర్సింహ, బాల్ నర్సింగ్, సంపత్ గౌడ్, ఘౌస్, సరీత, రాణి యాదవ్, యువ నాయకులు రాకేష్, జకీర్, నరేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పొలంపల్లి సర్పంచ్‌గా సత్య గౌడ్ బాధ్యతల స్వీకరణ



**చేగుంట జులై 20 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం పొలంపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా సత్య గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల పొలంపల్లి సర్పంచ్‌గా ఉన్న కొండి రాజ్యలక్ష్మి సస్పెన్షన్‌కు గురైన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈరోజు సత్య గౌడ్ బాధ్యతలు స్వీకరించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు.ఈ సందర్భంగా నూతన సర్పంచ్ సత్య గౌడ్ మాట్లాడుతూ, గ్రామ పరిరక్షణ కోసం పాటుపడతామని, పొలంపల్లి గ్రామాన్ని అభివృద్ధి దిశలోకి తీసుకుపోయే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# తనిఖీ చేసి ఊరుకోలేదు మరుసటి రోజు రిపేర్ చేయించిన ఉప సర్పంచ్ రఫీ





**చేగుంట జులై 20 మెదక్ టుడే న్యూస్**
చేగుంట బస్ స్టాండ్‌లో మొన్న ఆకస్మిక తనిఖీ నిర్వహించిన గ్రామ ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ, చెడిపోయిన మౌలిక వసతులను ఈరోజు స్వయంగా రిపేర్ చేయించి ప్రయాణికులకు అండగా నిలిచారు.మొన్న జరిగిన పరిశీలనలో బస్ స్టాండ్ ఆవరణలోని పురుషులు, స్త్రీల మరుగుదొడ్లలో నీటి సరఫరా సరిగా లేకపోవడం, కుళాయిలు పాడవ్వడం, పరిశుభ్రత లోపించడాన్ని ఉపసర్పంచ్ రఫీ గుర్తించారు. వెంటనే వాటిని బాగుచేయిస్తామని ప్రయాణికులకు హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం ప్లంబర్లను పిలిపించి చెడిపోయిన కుళాయిలను మార్పించి, నీటి పైప్ లైన్‌లను రిపేర్ చేయించి, మరుగుదొడ్లను పూర్తిగా బాగుచేయించారు. దీంతో బస్ స్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు.ఉపసర్పంచ్ రఫీ మాట్లాడుతూ, "మొన్న సమస్య చూశాను, ఈరోజు పరిష్కరించాను. ప్రయాణికులకు ఇబ్బంది కలగకూడదనే నా లక్ష్యం. బస్ స్టాండ్ వసతులను నిరంతరం పర్యవేక్షిస్తాం" అని తెలిపారు.

